క్లుప్తంగా

మార్కెట్ కమిటీ ఆదాయం పెంపునకు కృషి



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ సుధాకర్

గోపాలపురం: అగ్రికల్చర్ మార్కెట్ కమిటీల ద్వారా ఆదాయం పెంపునకు కృషి చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్ అన్నారు. గోపాలపురం ఏఎంసీ మార్కెట్ కమిటీని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా ట్రేడర్లకు అవగాహన కల్పించి ఆదాయ పెంపునకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో 2023–24 వార్షిక ఆదాయం రూ 30.80 కోట్లు కాగా 2024–25 సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.29.16 కోట్లు వసూలు చేశామని అన్నారు. రాష్ట్ర స్థాయి వసూళ్లలో ప్రథమ స్థానంలో ఉన్నట్లు సుధాకర్ తెలిపారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి కె.సత్యనారాయణ, సూపర్‌వైజర్ కొండలరావు పాల్గొన్నారు.

గోపాలపురం ఎస్సైగా మనోహర్



గోపాలపురం: గోపాలపురం ఎస్సైగా డి.మనోహర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజానగరం ఎస్సైగా పనిచేస్తూ గోపాలపురానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కర్రి సతీష్‌కుమార్‌ను వీఆర్‌కు పంపినట్లు సమాచారం.

సమిశ్రగూడెం ఎస్సైగా బాలాజీ సుందరరావు



నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం సమిశ్రగూడెం ఎస్సైగా ఎల్.బాలాజీ సుందరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. రాజమహేంద్రవరం ఎస్సైగా పనిచేసిన బాలాజీ సుందరరావు ఇక్కడకు రాగా, సమిశ్రగూడెం ఎస్సైగా పనిచేసిన కె.వీరబాబు సీఐడీ విభాగానికి బదిలీపై వెళ్లారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

గోపాలపురం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నారు. ఈ విషయాన్ని గురువారం నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ వినియోగదారులకు ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకూ, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ త్రీఫేస్ సరఫరా చేస్తామన్నారు.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు: పట్టణ పరిధిలో చెట్ల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. పట్టణంలో రామ్‌నగర్, గణేష్‌చౌక్, ఓవర్ బ్రిడ్జి డౌన్, పోలీస్ స్టేషన్, గాంధీ బొమ్మసెంటర్, రైల్వే గేట్, బేసివిరెడ్డి పేట, అన్నపూర్ణ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దేవరపల్లి: స్థానిక సెక్షన్ పరిధి బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాల్లో ఆర్డీఎస్ పనులు జరుగుతుండడంతో శనివారం 33/11 కేవీ రామన్నపాలెం సబ్ స్టేషన్ పరిధి 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్‌లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈ విషయాన్ని ఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. రెండు గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఇంటింటికీ సర్వే తక్షణమే ఆపాలి

నిడదవోలు: కూటమి ప్రభుత్వంలో పట్టణాల్లోని ఇంటి పన్నుల భారం మోపేందుకు మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న ఇంటింటికీ సర్వేను తక్షణమే ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జువ్వల రాంబాబు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల్లో ప్రజలపై ఎటువంటి భారాలు వెయ్యమని చెప్పి, గత నెల నుంచి గుట్టుచప్పుడు కాకుండా 15%శాతం ఆస్తి పన్ను పెంచేశారని అన్నారు. మళ్లీ ఇళ్ల, కట్టడాలకు కొలతలు వేసి మరో 20% శాతం పన్నులు పెంచడానికి ఆగమేఘాలపై సర్వే చేస్తున్నారన్నారు. సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న నిడదవోలులో ఆస్తి పన్ను కార్పొరేషన్‌గా ఉన్న రాజమహేంద్రవరంలో ఆస్తి పన్ను ఒకేలా ఉందన్నారు. నిడదవోలు ఆస్తి పన్నుల వసూళ్లపై అధికారులు సమగ్ర పరిశీలన చేయాలన్నారు.

నీరుగార్చారు..

- లస్కర్ల వ్యవస్థకు మంగళం
- 12 ఏళ్ల నుంచి భర్తీకాని పోస్టులు
- లాకుల సంరక్షణ గాలికి



పెరవలి వద్ద లాకులు

పెరవలి: లాకుల సంరక్షణ.. ఏటిగట్ల భద్రత.. సాగునీటి క్రమబద్ధీకరణకు ఉద్దేశించిన లస్కర్ల వ్యవస్థను నీరుగార్చారు.. ఏలూరు కాలువ, బ్యాంక్ కెనాల్, కాకరపర్రు కాలువ, నరసాపురం కాలువలున్నా వీటిని పర్యవేక్షించేందుకు లస్కర్లు లేకపోవటంతో కాలువలకు సక్రమంగా నీటి ప్రవాహం జరక్క రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఏ కాలువపై మెట్ట పంటలు ఉన్నాయి... ఏ కాలువపై వరి సాగు జరుగుతున్నది, ఏ కాలువకు ఎంత మేర సాగునీరు అందిస్తే పంట పొలాలకు సరిపోతుందనే వాటిపై అవగాహన ఉన్న లస్కర్లు నేడు కనుమరుగయ్యారు. అంతే కాకుండా కాలువలు అడుగడుగునా ఆక్రమణకు గురవడంతో ఇబ్బంది ఎదురవుతోంది. గట్లు కుచించుకుపోతున్నాయి. దీనికంతటికీ కారణం కాలువలపై పర్యవేక్షణ లేకపోవటంతో పాటు అందుకు సిబ్బంది లేకపోవటమే. ఒక్కో లాకు వద్ద 20 నుంచి 30 మంది వరకూ విధులు నిర్వర్తించాల్సి ఉండగా నేడు కనీసం 10 మంది కూడా లేని దుస్థితి. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఇరిగేషన్ శాఖకు నేడు విధులు నిర్వర్తించటానికి శిథిల భవనాలే గతి అయ్యాయి.

ఏడాది నుంచి జీతాలు ఇవ్వాలి



పెరవలి లాకుల పరిధిలో 27 మంది విధులు నిర్వర్తించాలి. అయితే ప్రస్తుతం ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగులతో పాటు 9 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పని చేస్తున్నాం. వీరికి ఏడాది నుంచి జీతాలు ఇవ్వాల్సి ఉంది. ఎక్కడా ఇబ్బంది రాకుండా చూస్తున్నాం.

– ఎస్.బాలమురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, పెరవలి

ఏ ఏ కాలువలు అంటే..

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి అన్ని కాలువలకు నీటి ప్రవాహం మొదలవుతుంది. నిడదవోలు నియోజకవర్గంలో విజ్జేశ్వరం వద్ద ప్రారంభమైన పశ్చిమ డెల్టా కాలువ నిడదవోలు వచ్చేటప్పటికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని అన్ని ముఖ్య పట్టణాలను ఆనుకుని వివిధ కాలువలు ఉన్నాయి. పెరవలి మండలం కాకరపర్రు కెనాల్, బ్రాంచ్ కెనాల్, నరసాపురం కాలువలు ఉన్నాయి. వీటి పరిధిలో చిన్న పిల్ల కాలువలు 230 వరకూ ఏర్పాటు చేశారు. కాకరపర్రు కెనాల్‌పై పెరవలి లాకు ఉండగా, దీని పరిధిలో 37,357 ఎకరాల సాగు భూమి ఉంది. సుమారు 51 గ్రామాలకు సాగునీరు అందించి 7 మండలాలకు సంబంధించిన తణుకు, నిడదవోలు, ఆచంట నియోజక వర్గాలను కలుపుతూ సాగు, తాగునీరు అందిస్తుంది.

ఎంత మంది ఉండాలంటే..

పెరవలి లాకుల పరిధిలో మొత్తం 27 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం (ఏఈ, గుమస్తా) ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగులతో పాటు 9 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ లాకుల పరిధిలో కాలువలైన ఉండ్రాజవరం, రామయ్యగుంట, అజ్జరం, భూపయ్య కాలువ, ఈస్ట్ విప్పర్రు, ఖండవల్లి, పేకేరు కాలువలపై ఏడుగురు డెల్టా లస్కర్లు ఉండాల్సి ఉండగా 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే కెనాల్‌పై లస్కర్లు ఐదుగురు ఉండాల్సి ఉండగా ఎవరూ లేరు. వైరు లస్కర్లు ఇద్దరికి ఒకరు మాత్రమే ఉన్నారు. వైర్ సూపరింటెండెంట్, లాకు లస్కర్లు నలుగురు, లాకు సూపరింటెండెంట్, గుమస్తాలు 2, వర్క్ ఇన్‌స్పెక్టర్లు 2, వాచ్‌మెన్ 1, ఎవెన్యూ లస్కర్ 1 పోస్టు ఉండగా, ఇవన్నీ ఖాళీగానే ఉన్నాయి. వీరి విధులు 9 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారు. ఇదిలాఉంటే ఏడాదిగా వీరికి జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.



పెరవలిలో చెత్తాచెదారంతో నిండిన గరప కాలువ

గంగానమ్మ జాతర ప్రారంభం



జాతర ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన భక్తులు

నల్లజర్ల: పోతవరం గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం భక్తుల కోలాహలం మధ్య ప్రారంభమైంది. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద విఘ్నేశ్వరపూజ, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పుట్టిల్లు నుంచి తీసుకువచ్చి సంప్రదాయబద్ధంగా పొన్పు వేశారు. అనంతరం అక్కడి నుంచి అత్తవారిల్లు వద్దకు తీసుకువచ్చి అక్కడ కూడా పొన్పు నిర్వహించారు. అక్కడి నుంచి ఉత్సవ మూర్తులను సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూరి గుడిసెకు తీసుకువచ్చి వివిధ రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుమర్తి సతీష్, యేలేటి సత్యనారాయణ, పెండ్యాల వీరరాఘవులు, గన్నమని వెంకటేశ్వరావు, బొర్రా చినపుల్లయ్య, అట్లూరి మోహన్, పిచ్చుకుల ప్రసాద్, గంటా కృష్ణారావు, గంటా లక్ష్మణ్, గంటా చినకృష్ణారావు, బొర్రా జగన్, పసుమర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



పెరవలిలో యోగా సాధన చేస్తున్న మండల అధికారులు



అరికిరేవులలో యోగాంధ్రా రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ డైరెక్టర్ అప్పలకొండ



కొవ్వూరులో యోగా సాధన చేస్తున్న అధికారులు , సిబ్బంది

తాళ్లపూడి (కొవ్వూరు): యోగాంధ్రకు ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి జిల్లా జాయింట్ డైరెక్టర్ అప్పలకొండ అన్నారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో గురువారం యోగాంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఓ జె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- కొవ్వూరు పట్టణంలోని ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠం వద్ద యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరరూ జరిగిన ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు పెనుమత్స సత్యనారాయణరాజు, సరోజినిలు యోగా శిక్షణ ఇచ్చారు. మున్సిపల్ కమీషనర్ నాగేంద్రకుమార్, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎంఈఓ రామకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: నిరంతర యోగా సాధనతో ఒత్తిడి దూరం చేయవచ్చని యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగాంధ్రా మాసోత్సవం సందర్భంగా యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లకు యోగా, ధ్యానం తదితర వాటిపై అవగాహన కల్పించారు.

యోగాతో మానసిక ప్రశాంత

పెరవలి: యోగాతో పని ఒత్తిడిని దూరం చేయవచ్చని తాహసీల్దార్ డి.అచ్యుత కుమారి తెలిపారు. పెరవలి మండలం పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో కలసి యోగా శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ పద్మజ మాట్లాడుతూ యోగాపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సభలను విజయవంతం చేయండి



కొవ్వూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీజీఈఏ సంఘ నాయకులు, ఉద్యోగులు

తాళ్లపూడి (కొవ్వూరు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర మూడో కౌన్సిల్ సభలు జూన్ 5న విజయవాడలో జరుగుతాయని, వాటిని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ పిలుపునిచ్చారు. గురువారం కొవ్వూరు డివిజన్‌లోని ఉద్యోగులను కలసి రాష్ట్ర కౌన్సిల్ సభలకు హాజరు కావాలని ఆహ్వానించారు. కొవ్వూరు ఏరియా హాస్పటల్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జూన్ 5న విజయవాడలో జరిగే ఈ సభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ సభల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడడం, సీపీఎస్ రద్దు వంటి డిమాండ్ల సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జీబీ విజయకుమార్, కె.వెంకటేశ్వరరావు, దినేష్, రెహ్మాన్, నాగేశ్వరరావు, భద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలకు తావు లేకుండా చర్యలు



తాడిపూడి ర్యాంపు-3లో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

తాళ్లపూడి: తాడిపూడి ఓపెన్ ఇసుక ర్యాంపుల నుంచి ఏలూరు జిల్లా స్టాక్ పాయింట్‌కు ఇసుక తరలిస్తున్నారని, ఇక్కడ వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, అధిక ధరలకు అమ్మకాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే పూర్తి విచారణ చేస్తామని ఆర్డీఓ రాణి సుస్మిత అన్నారు. తాడిపూడిలోని ఓపెన్ ఇసుక ర్యాంపును గురువారం ఆర్డీఓతోపాటు మైనింగ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ర్యాంపు నుంచి ఇసుక తరలింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆర్డీఓ రాణి సుస్మిత మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రెండు ఓపెన్ ర్యాంపులు ఉండగా ఒకటి బోట్స్‌మెన్ సొసైటీ నిర్వహిస్తుందన్నారు. ఏలూరు జిల్లా స్టాక్ పాయింట్‌కు ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తున్నారని, దీనిని పోలవరం తాహసీల్దార్ పర్యవేక్షిస్తారన్నారు. నాలుగు రోజుల క్రితం అనుమతులు ఇచ్చారని, ఇప్పటి వరకూ 8,500 మెట్రిక్ టన్నుల ఇసుక తరలించారన్నారు. మొత్తం లక్ష మెట్రిక్ టన్నులకు అనుమతి ఇచ్చామని అన్నారు. ఒక పత్రికలో ఇక్కడ లారీకి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఇసుక అమ్మకాలు చేస్తున్నారని వచ్చిందని, దీనిపై అధికారుల బృందంతో పూర్తి స్థాయి విచారణ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ ఎటువంటి అవకతవకలు జరగలేదని తెలిపారు. అధిక ధరలకు అమ్మకాలు చేస్తే తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ర్యాంపులో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉందన్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ విఘ్నేశ్వరరావు, ఇన్‌చార్జి తాహసీల్దార్ మోహనభారతి, ఎస్సై టి.రామకృష్ణ, ఆర్ఐ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా



డ్రోన్ కెమెరాలో నమోదైన ధవళేశ్వరంలోని ఓ ప్రాంతం

ధవళేశ్వరం: గ్రామంలోని నిర్మానుష్య ప్రాంతాల్లో గురువారం ధవళేశ్వరం పోలీసులు డ్రోన్లతో నిఘా పెట్టారు. స్థానిక రామపాదాల రేవు, జాలరుపేట, సాయిబాబా గుడి వెనుక ప్రాంతం , కంచర్ల లైన్, బోటావీసు వీధి తదితర ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక కంచర్లలైన్ వద్ద గోదావరి గట్టున మద్యం తాగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసినట్లు ధవళేశ్వరం సీఐ టి.గణేష్ వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి ఉత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీపద్మావతి, గోదాదేవీ సమేత వేంకటేశ్వరస్వామివారి గోవింద క్షేత్రంలో జరుగుతున్న 15వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తిరువీధి ఉత్సవం, గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీలక్ష్మీహయగ్రీవయిష్టి, సీతారామచంద్ర మూర్తికి క్షీరాదివాసం, పూర్ణాహుతి, తీర్థగోష్ఠి జరిపారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణ, అనంతరం శ్రీవారి తిరువీధి ఉత్సవం, గరుడ వాహన సేవ, సీతారామచంద్రమూర్తికి పంచశయ్యాదివాసం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

నిరంతర పరిశీలన

- ప్రభుత్వాస్పత్రిలో 60 సీసీ కెమెరాలు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్
- త్వరలో మరిన్ని ఏర్పాటుకు చర్యలు



ప్రభుత్వాసుపత్రిలో సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ సూర్యప్రభ

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మరింత కట్టుదిట్టమైన భద్రతా పర్యవేక్షణలో కొనసాగుతోంది. ఇప్పటికే ఆసుపత్రి అంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంది. గతంలో సీసీ కెమెరాల నిఘా ఉన్నా అవి అంతంత మాత్రంగా ఉండేవి. అంతేకాక వాటిని అవసరం లేని ప్రాంతాల్లో వృథాగా ఏర్పాటు చేశారు. పేరుకు మాత్రం సీసీ కెమెరాలున్నా వాటి లక్ష్యం మాత్రం సున్నాగా ఉండేది. ఈ విధంగా ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా పలుమార్లు వైద్య సామగ్రి దొంగతనాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఆసుపత్రిలో నిత్యం అధిక సంఖ్యలో వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. వారు సయయానికి విధులకు హాజరైనా తర్వాత వారు ఏం చేస్తున్నారు, రోగులతో ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు అనే విషయాలు తెలుసుకునే వీలుఉన్నా ఆ పని అంతంతమాత్రంగానే జరిగేది. దీంతో తమ ఇష్టారాజ్యంగా కొందరు సిబ్బంది ప్రవర్తించేవారు.

60 సీసీ కెమెరాలు

ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో 60 సీసీ కెమెరాలు నిత్యం పనిచేస్తున్నాయి. వీటిలో ప్రధాన ఆసుపత్రిలో 46, మాతా శిశు విభాగంలో 24 కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి మానటరింగ్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ తన గదిలోంచే పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యుల నుంచి వైద్య సిబ్బంది, నర్సుల పనితీరును నిత్యం పరిశీలిస్తున్నారు. దీంతో పనివేళల్లో ఆసుపత్రిలో అన్ని విభాగాల సిబ్బంది అప్రమత్తతతో ఉంటున్నారు. సూపరింటెండెంట్ సీసీ కెమెరాల్లో చూస్తున్నారు అనే భయంతో సిబ్బంది రోగులతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రిలో రోగులు అధికంగా వచ్చే జనరల్ వార్డు విభాగం, ఆర్థో విభాగం, ఆర్ఎంవో గది ప్రాంతం, ఆసుపత్రిలోని పైఅంతస్తుల్లోని పలు రద్దీగా ఉండే విభాగాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరికొన్నింటిని త్వరలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నిత్యం పర్యవేక్షణ

ఆసుపత్రిలో సీసీ కెమెరాలను నా గది నుంచే నేరుగా పర్యవేక్షిస్తాను. ఆసుపత్రి రద్దీగా ఉండే ఉదయం సమయంలో వీటిపై అధికంగా దృష్టి పెడతాను. ఆసుపత్రిలో రోగులు రద్దీ, ఓపీ చూస్తున్న డాక్టర్లపై పర్యవేక్షణ ఉంటుంది. ఒక్కోసారి వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించడం కూడా కనిపిస్తుంది. వెంటనే సంబంధిత వ్యక్తులను పిలిచి మెమోలు ఇచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. అలాగే ఎవరైనా రోగుల వద్ద డబ్బులు వంటివి డిమాండ్ చేస్తున్నారా అనే విషయాల్ని గమనిస్తున్నాం. ఎక్కడైనా అటువంటివి జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల పర్యవేక్షణతో వైద్య సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉంటున్నారు.

– డాక్టర్ సూర్యప్రభ, సూపరింటెండెంట్

స్వచ్ఛమైన నీరు అందేలా చర్యలు



చిలకపాడులో ట్యాంక్‌ను పునః ప్రారంభిస్తున్న సర్పంచ్ సూర్యకుమారి

ఉండ్రాజవరం: ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చిలకపాడు సర్పంచ్ తిరుమళ్ల సూర్యకుమారి అన్నారు. చిలకపాడులో 60 వేల లీటర్ల కెపాసిటీ గల రక్షిత మంచినీటి ట్యాంక్ (ఓహెచ్‌ఎస్‌ఆర్) మరమ్మతుల అనంతరం గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో ఈ పనులు చేపట్టామన్నారు. తాను పదవి చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ గ్రామంలో సుమారు రూ. కోటితో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు తిరుమళ్ల నాగపార్వతి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పింర్రా పోసేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి చోళ్ల రాజు, గోడే ఆదినారాయణ, చాట్రాది చిట్టిబాబు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్ర... సేవాతృష్ణ

- ప్రజలకు అండగా కార్యక్రమాలు
- సమాజ మార్పునకు ప్రయత్నం

నల్లజర్ల: సేవ చేయాలనే తపన వారిని ముందుకు నడిపిస్తోంది.. ఎందరో అభాగ్యులకు ఆసరాగా నిలుస్తోంది.. విద్య, వైద్యం, ఆర్థిక ఆసరా కార్యక్రమాలు నిర్వహిస్తూ సంఘ మిత్ర సేవా సంస్థ తమ కార్యకలాపాలు చేపడుతోంది.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ముసుళ్లగుంట గ్రామానికి చెందిన అంబటి శ్రీనివాసరావు సంఘమిత్ర పేరుతో సేవా సంస్థను స్థాపించారు. దూబచర్ల కేంద్రంగా 1997లో కేవలం ముగ్గురు సభ్యులతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు 30 మందితో అనేక సంస్థల సాయంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. తద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తుంది.

సేవా కార్యక్రమాలు ఇలా..

సంఘ మిత్ర సంస్థ ద్వారా దాదాపు 100 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, 500 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారు. రక్తదాన శిబిరాల ద్వారా దాదాపు 2 వేల మందికి రక్తం అందించారు. కార్పొరేట్ ఆసుపత్రుల ద్వారా దాదాపు 200 వైద్య శిబిరాలు నిర్వహించి 5 వేల మందికి వైద్య సాయం చేశారు. నిరుపేద మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, వారికి మెషీన్లు, గ్రైండర్లు అందించారు. బుడమేరు వరద సమయంలో 2 వేల మందికి దుప్పట్లు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వివిధ గ్రామాల్లో 10 వేల మొక్కలు నాటి రక్షణకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల్లో మహిళలు, పురుషులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. కరోనా సమయంలో 889 రోజులు పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేశారు.



కంటి వైద్య శిబిరంలో సంఘ మిత్ర సభ్యులు

సేవలతో సంతృప్తి



గత 28 ఏళ్లగా సంఘ మిత్ర ద్వారా సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతృప్తిగా ఉంది. పట్టణాల్లో ఉండే వైద్యులను పిలిపించి పేదలకు వైద్య సాయం అందించడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటించడం, విద్య, వైద్యం, మహిళా సాధికారత వంటి అంశాలపై దృష్టిసారిస్తున్నాం. సమాజంలో జరుగుతున్న అసమానతలను రూపుమాపేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశాం.

– అంబటి శ్రీనివాసరావు, సంఘమిత్ర వ్యవస్థాపకుడు

చాలా సంతోషంగా ఉంది



సంఘమిత్ర సంస్థలో సభ్యునిగా చేరి సేవలు అందించడం చాలా సంతోషంగా ఉంది. మేం చేస్తున్న సేవలను చూసి గ్రామాల్లో స్నేహితులు కూడా సభ్యులుగా చేరుతున్నారు. ఎన్నో వైద్య శిబిరాలు నిర్వహించి నిరు పేదలకు ఖరీదైన వైద్యసేవలు అందించడం, ఉచితంగా మందులతో పాటు ఖరీదైన కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందించం ఎంతో సంతృప్తిని ఇచ్చింది.

– కెల్లా వాసు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, దూబచర్ల

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి పల్లకీ సేవ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పల్లకీలో డప్పు వాయిద్యాలతో పురవీధులలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట నృత్యం అలరించింది. కార్యక్రమంలో భక్తులు, రైల్వే ఉద్యోగులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.